# వానర హస్తం

--నిడదవోలు మాలతి

## ooo

చేసిన తప్పు నలుగురిముందూ ఒప్పుకోకపోయినా, తప్పు చేసినానని తెలుసుకుని, దాన్ని దిద్దుకోడానికి నా చేతనైన ప్రయత్నం చేసి, చేశానన్న సంతృప్తితో హాయిగా నిద్ర పోయాను ఆరాత్రి. కన్ను మూసి తెరిచేసరికి ఎనిమిది గంటలయిపోయింది.

కరెంటు ఫెయిలయిందేమో భక్తి రంజని వినిపించలేదు. వంటింటిలోంచి ఎవర్నో ఉద్దేశించి అమ్మ చేస్తున్న పుణ్యాహవాచనాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. దుప్పటి ఓ పక్కకి తన్నేసి, హుషారుగా లేచాను. టూత్‌బ్రష్ అందుకోబోతూంటే, టేబుల్లైటు పక్కనే పది రూపాయలనోట్లు బొత్తి కనిపించింది.

అట్టే దానివేపు చూస్తుంటే, ''లెక్క పెట్టుకో. సరీగ్గా ఇరవై అయిదుంటాయి'' అన్నట్టనిపించింది. నిన్ననే బాంకునించి డ్రా చేసి ఆ నోట్లు అలాగే తీసుకొచ్చి అమ్మ దగ్గరిచ్చాను. అమ్మ ఆ డబ్బు తీసుకోవడం నాకు బాగా జ్ఞాపకం ఉంది.

''...అవునే, వెధవ ఒళ్లు కొవ్వెక్కి ఉన్నాడు... వాళ్లూ, వీళ్లూ తిన్న ప్లేట్లో మిగిలిన ఎంగిలిముక్కలు తింటూ రోడ్లంట తిరుగుతున్న వెధవని తీసుకొచ్చి, రెండు అక్షరమ్ముక్కలు చెప్పించి, నిక్షేపంలాంటి నౌకరీ చేసుకోరా అని పంపించినందుకు...''

అమ్మ మాటలు ఈమాటు స్పష్టంగా తెలుస్తున్నాయి.

అమ్మ మాటాడుతున్నది పనిమనిషి నూకాల్తో.

ఆశీర్వదిస్తున్నది దాని కొడుకు ముత్తయ్యని.

''ఏమిటమ్మా?'' అన్నాను వంటింటి గుమ్మంలో నిలబడి.

''చూడరా, వాడి కావరం. వేలెడంత వెధవగా ఉన్నప్పుడు సుందరికి స్కూలికి కాఫీ తీసుకెళ్ళమని మనం కదూ పని నేర్పింది...''

నాకు తెలీదు. నా చదువంతా తాతగారింట్లో సాగింది.

''మళ్లీ ఆ మధ్య ఎక్కడో కాకా హోటల్లో తినితిరుగుతున్నాడని, ఈ ముండ నెత్తీ, నోరూ బాదుకుంటే, మళ్లీ వాడిని పిలిచి, స్కూల్లో చేరమని డబ్బులిచ్చి పంపించాను కదా. ..''

నాకు తెలీదు.

''వాడు ఫోర్తుఫారం కొచ్చేసరికి, నాకు పూజకి నాలుగు పువ్వులు కోసుకురావడం నామోషీ అయిపోయింది. తోటి పిల్లలు వేళాకోళం చేస్తారు, నేనట్లాటి పనులు చెయ్యను అన్నాడు వెధవ..''

కాబోలు.

''ఇప్పుడు ఉద్యోగంలో పోనీ గదా అని సాయం చేయబోతే, 'ఆ డబ్బు ఆ బాబుకే ఇచ్చీ, నా తప్పు నేనే కాసుకోగల్ను' అన్నాడుట. తప్పు చేయందే, నేనెందుకు డబ్బు కట్టాలని లా పాయింట్లు తీస్తున్నాట్ట నీతిమాలిన వెధవ''

నాకు కడుపులో దేవినట్టయింది.

''వాడికి చెప్పు నన్నోమారు కలుసుకోమని,'' అన్నాను, ఎందుకో నాకే తెలీకుండా.

నాకు వాణ్ణి మెచ్చుకోవాలనిపిస్తోంది. తక్కువ జాతివాడు వాడు కాదు, నేనే అని నా అంతరాత్మ ప్రబోధిస్తోంది.

''ఎందుకూ? నువ్వు చెప్తే మాత్రం వాడు వింటాడా? ఆ జాత్తిరే అంత. నాలుగు వేళ్లూ నోట్లో కెళ్లేసరికి, కళ్లు

నెత్తికెక్కుతాయి. ఆ తీసుకెళ్లిన డబ్బు ఎక్కడ తగలెట్టాడో, మళ్లా డబ్బిచ్చి, ఉద్యోగం నిలబెట్టుకోరా అంటే తీపి దిగలాగిందేం?''

నిన్నటివరకూ వాడు నిర్దోషి నని నమ్మిన అమ్మ కూడా ఇవాళ 'ఆ తీసికెళ్ళిన డబ్బు' అంటోంది!

బాత్రూంలోకి వెళ్లి, మొహం కడుక్కొచ్చి, కాఫీగ్లాసుతో హాల్లో కూచుని, ఆరోజు పేపరు చూస్తున్నాను. ఏముంది– హత్యలూ, దొంగతనాలూ, రైలు ప్రమాదాలూ, బస్సు ప్రమాదాలూ, మరణించిన వారి సంఖ్య, గాయపడినవారి సంఖ్య...

ముత్తయ్య తప్పు చేశాడా? లేదా? ఒకవేళ చేసి ఉంటే, చేసిన తప్పుకీ, వేసిన శిక్షకీ సమన్వయం కుదిరిందా? లేదా? లేదూ? కుదిరిందా?!!

OOO

మూడు రోజుల కిందట డిస్పాచిసీటులో ఉన్న సావిత్రి వచ్చి ''సార్'' అంటూ ఏడ్చేసింది. ఆడపిల్లల్ని ఆఫీసుల్లో వేసుకుంటే ఇదో బాధ.

''ఏం తల్లీ! డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలీదా? నీ డబ్బయితే, అంత సాదాగా రెండు వందల రూపాయిలు టేబులుమీద పెట్టేసి, చక్కర్లు కొడతావా?''

''అది కాదు సార్...''

''ఏది కాదు. నువ్వు డబ్బు టేబులుమీద పెట్టలేదా?''

''అది కాదు సార్...''

''లేదూ?''

''పెట్టానండీ''

''మరి?''

''బ్రాంచి ఆఫీసు ముత్తయ్య అప్పుడే వచ్చేడండీ. ట్రెజరీకి పంపడానికి ఇక్కడ ప్యూనెవరూ లేరు. ముత్తయ్య అటే వెళ్తాడు కదా అని.''

ఈ కథంతా మీ సూపరెండెంటు చెప్పాడమ్మా!

''.. అని ముత్తయ్య చేతికిచ్చానండీ..''

''చేతికిచ్చావా?'' సూటిగా మొహంలోకి చూస్తూ ప్రశ్నించాను.

''ఊహు. అంటే చేతికివ్వలేదండీ... నువ్వు వెళ్ళేటప్పుడు ఈ ఫారమూ, డబ్బూ తీసుకెళ్లి ట్రెజరీలో కట్టెయ్ అని చెప్పానండీ''

''చెప్పడానికీ, చేతిలో పెట్టడానికీ నీ పరిభాషలో బేధం లేదేమిటి?'' అన్నాను. ఆ అనడంలో నా మనసులో లేని అభిప్రాయాలు స్ఫురించాయి. సావిత్రి కళ్లు ఆశతో మెరిశాయి.

''క్షమించండి సార్''

''క్షమిస్తానమ్మా! అది చాలా సులభం కూడాను. నా అంతరాత్మ ప్రబోధం కూడా అలాగే ఉంది. కాని ఆఫీసు డబ్బు అలా ఎక్కడ పడితే అక్కడ మాయమవుతుంటే ఆడిటర్సు, మేనేజిమెంటూ కూడా సంతోషించరమ్మా!''

''సార్! మీరే దిక్కు సార్. ఇంట్లో పరిస్థితులు మీక్కూడా తెలుసు కదా సార్''

అవును. విన్నాను. పూటకి ఎనిమిది కంచాలు లేస్తాయి. కాని నెలసరి ఆదాయం ఈ పిల్లకొచ్చే నూట డెబ్భై మాత్రమే!

''ఇప్పటికే చాలా అప్పులున్నాయండీ. మా పెద్ద తమ్ముడి చదువు కూడా మానిపించేశాం''

''ఊం'' అన్నాను, తల ఫైళ్లలో దూర్చేస్తూ.

''మరి అంత అజాగ్రత్త అయితే ఎలా ఉద్యోగంలో?''

''అజాగ్రత్త కాదండీ. చిన్న తమ్ముడు సైకిలుకింద పడ్డాడని ఎవరో చెబితే, తొందర తొందరగా వెళ్ళిపోయానండీ''

''డబ్బు టేబులిమీద పారేసి...''

''ముత్తయ్యతో చెప్పానండీ''

''సరే, నీ పని చూసుకో'' అన్నాను.

అంత సంసారం ఈదుతున్న ఆడపిల్ల ఉద్యోగం నిలపమని ప్రాధేయపడుతోంది. పోనీ, ఆడబ్బు నేనే యిచ్చి, కట్టించేదాం అంటే– ఆ అమ్మాయి మొదట మిస‌ప్రోప్రియేట్ చేసినట్టు ఒప్పుకోవాలి. బ్లాక్‌మార్క్. ప్రోమోషను రావలసిన పిల్ల, కుటుంబాన్నాదుకుంటున్న పిల్ల.

సాయంత్రం మళ్ళీ కనిపించింది.

మర్నాడు కనిపించమన్నాను.

ఆఫీసుకెళ్లగానే మళ్లీ కనిపించింది.

ఆపద్బాంధవా! ఏం చెయ్యను? ఆపిల్లకేం చెప్పను?

''ఎలాగయినా, నన్ను ఈ చిక్కులోంచి బయట పడేయండి సార్. మీకు నా ఫామిలీ అంతా ఆజన్మాంతం కృతజ్ఞులమయి ఉంటాం''

ఆ కళ్ళు! – వాటినిండా నీళ్లు!

అప్పుడేం చెప్పాను? సరిగ్గా గుర్తు రావడంలేదు. 'అదే వ్రాసియ్యి' అన్నట్టు జ్ఞాపకం. ఏది వ్రాసి ఇస్తున్నావో!

ముత్తయ్యపేరు నేనే సజెస్ట్ చేశానా? ఆ అమ్మాయి అంటే నేను తలూపేనా? ఊహుం. ఏమైందో సరీగా గుర్తు రావడం లేదు.

అంతకుముందు బ్రాంచి మానేజరు వచ్చి, కొత్తగా ఉద్యోగంలో చేరిన ముత్తయ్య గురించి– పని సరిగ్గా చెయ్యడం లేదనీ, పొగరుమోతు అనీ, నమ్మకస్తుడు కాడనీ, ఎక్కడికి పంపినా ఆ పూటంతా రాడనీ... ఏవేవో చెప్పాడు.

ఇవన్నీ నేను సావిత్రితో ఎందుకు చర్చించేనో జ్ఞాపకం రావడం లేదు. సావిత్రికి ఇవన్నీ చెప్పవలసిన అవసరం లేదు. అయినా చెప్పాను.

''ఆ డబ్బు ముత్తయ్య తీసుకుని, తీసుకోలేదని బుకాయించడానికి అవకాశం ఉంది కదండీ'' అంది సావిత్రి.

ఆ పిల్ల మొహంలో సుదూరంలో లైహౌసు కనిపించిన కళాసీలా వెలిగింది.

''కావొచ్చు. ముత్తయ్యలాటివాళ్లు మరో తొంభై మంది వచ్చి వుండొచ్చు ఆసీటు దగ్గిరికి'' అన్నాను. ఆ అనడంలో హెచ్చరిక లేదు. స్లిపరీగ్రౌండులో అడుగెట్టానని అప్పడు అనుకోలేదు.

''కాని, ముత్తయ్యకి ప్రత్యేకంగా చెప్పానండీ. చలాన్‌ఫారంలో డబ్బు పెట్టి బల్లమీద పెడుతున్నానని'' – సావిత్రి ఎక్కడికి నడిపిస్తోందో తెలుస్తూనే ఉంది.

'' జరిగింది జరిగినట్టు రాసియ్యి. తరవాత చూస్తాను'' అన్నాను.

నేను సావిత్రికి చెప్పింది అంతే అనుకుంటాను. నాకు అలాగే జ్ఞాపకం.

సావిత్రి మాత్రం 'తాను ఆ డబ్బూ, చలాన్‌ఫారం ముత్తయ్య చేతికిచ్చినట్టు, అలా ఇచ్చినందువల్ల తన బాధ్యత, విధి నిర్వహణలో తన లోపం ఏమీ లేనట్టూ రాసి ఇచ్చింది. ఆ కాగితమ్మీద నేను సంతకం పెట్టేను. దానిమీద సూపరెండెంటుకి నోట్ రాశాను. ఆ నోటుమీద సంతకం పెట్టాను.

ఆ సాయంత్రం ఇంటికొచ్చేసరికి ''సంపేసినాడు, బాబో'' అంటూ నూకాలు నాకాళ్ళు పట్టుకుంది.

''ఏమిట యిందమ్మా?'' అన్నాను చిరాకు పడుతూ.

అమ్మ చెప్పింది, ''దానికొడుకు చెంగల్రావుపేట అదేదో ఆఫీసులో పని చేస్తున్నాడు. అదెవరో అమ్మాయి రెండొందల్రూపాయిలు పారేసుకుంటే, అది వీడిమీదకి తోసి, ఆ డబ్బు కట్టుకోమంటున్నారుట''

చచ్చేను, ఫో. జగద్రక్షకా! నన్ను నేనెలా కాపాడుకోను?

''కల్లూ, వొల్లూ, తిప్పుకుంటూ కబుర్లు సెప్పే ఆడకూతురని, ఆయమ్మ నొగ్గేసి, ఆ ఆఫీసరు బాబు నాకొడుకు పొట్ట కొట్టేసినాడు''

''సరేలే. నువ్వింటికి పో. నేను తరవాత చూస్తాను'' అన్నాను.

OOO

ఆ రాత్రి అమ్మ చాలా రికమెండు చేసింది వాడికేసు. వాళ్ల జన్మలో రెండొందలెక్కడ తేగలరంది. కుర్రవెధవ, ఇంతప్పట్నుంచీ తన కళ్ల ముందు పెరిగినవాడంది. వాడసలు డబ్బు తియ్యలేదుట. వాడు అలాంటి వాడు కాదుట

ఆఖరికి అన్నాను, ''లేదమ్మా! వాడి ఆఫీసరు నాకు చెప్పాడు– ఆఫీసులో సరిగ్గా పని చెయ్యడుట, లక్ష్యం లేదుట'' అని.

''అయితే, అందుకని, చెయ్యని నేరాలు వాడి నెత్తిన రుద్దుతారుట్రా? తప్పొకటీ, శిక్షొకటీనా?''

ఏం సమాధానం చెప్పను?

అందుకే, నిన్న డబ్బు తెచ్చి అమ్మకిచ్చి, ''ముందు ఈ డబ్బు ట్రెజరీలో కట్టేయమను. తరవాత చూస్తాను'' అన్నాను. అలా అన్నప్పుడు, వాడి ఉద్యోగానికి మాత్రం ఏ ముప్పూ రాకుండా చూడాలనే అనుకున్నాను. ఆపని చాలా సుళువు అని కూడా అనుకున్నాను. నా అంతరాత్మ అలాగే ప్రబోధించింది కూడాను. నిశ్చింతగా నిద్ర పోయాను.

తెల్లారుతూనే తెలిసిన విషయం – వాడు ఆడబ్బు తిరగ్గొట్టేడు. దానంతటికీ వెనకనున్న ఆఫీసరుబాబుని నేనేనన్న సంగతి, అమ్మా, నూకాలూ పోల్చుకోలేదు, కాని వాడికి తెలుసు.

''ఇదన్నాయం. నానెందుక్కట్టాల ఆ డబ్బు? ఆయమ్మ నాకియలేదు. నాకేటీ తెలీదు. జెయిల్లోకేనా పోతాను గానీ నాను సైని తప్పు నానెందుకొప్పుకోవాల'' అన్నాడుట.

''వాడి పొగరెలా ఉందో చూడు,'' అంది అమ్మ, ''బాగుపడే లక్షణాల్లేవు. అడుక్కుతిని పోతాళ్ళే.''

వాడికి బాగుపడే లక్షణాల్లేవని కాదు నా బాధ. వాణ్ని బాగు చేసే లక్షణం నాకు లేకపోయిందే అన్నదే నా చింత.

OO

(జయశ్రీ , 1971, సంక్రాంతి ప్రత్యేక సంచికలో ప్రచురితం)